సాక్షి
బాపట్ల
సోమవారం । 17 । జూలై । 2023




వేణుగోపాలుడి సేవలో..

కోడూరు: హంసలదీవిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి రామిరెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.



భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి: లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1,016 క్యూసెక్కులు వదిలారు. కొమ్మమూరు కాల్వకు 514 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: పంచారామాల్లో ప్రథమారామమైన అమరావతి అమరేశ్వరాలయంలో ఆదివారం లోక కల్యాణార్థం స్వామికి లక్ష బిల్వార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. గణపతి హోమం నిర్వహించి స్వామికి విశేష అలంకరణ చేసి సహస్ర నామాలతో రుత్వికులు అమరేశ్వరునికి లక్ష బిల్వ దళార్చన నిర్వహించారు. బాలచాముండేశ్వరిదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ మాట్లాడుతూ అమరేశ్వరుని ఆరాధించి లక్ష బిల్వార్చన, బాలాచాముండేశ్వరిదేవికి కుంకుమార్చన చేస్తే శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వేమూరి గోపీనాథశర్మతోపాటుగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 518.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎడమ కాలువకు 3,972, ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీటి చేరిక నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.10 అడుగుల వద్ద ఉంది.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



పట్నంబజార్(గుంటూరు ఈస్ట్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూర్‌బాషాలకు వైఎస్సార్ షాదీ తోఫా పథకం అమలు చేస్తూ జీఓ జారీ చేయడంపై ఆదివారం నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంఘ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు స్టార్ మస్తాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పలువురు నూర్‌బాషా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో తెలంగాణ మంత్రి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ తరగతుల అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రి ఈశ్వర్‌కు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు.

సుబ్బారాయుడి నిత్యాన్న దానానికి విరాళం

మోపిదేవి(అవనిగడ్డ): వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన సజ్జా భార్గవ కృష్ణ, హారిక రూ.1,00,116 చెక్కును ఆదివారం అందజేశారు. దాతలను ఆలయ ఏసీ చక్రధరరావు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో క్యూలైన్లన్నీ రద్దీగా కనిపించాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగలిశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది.

దుర్గమ్మ నిత్యాన్నదానానికి..

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్ మాదాపూర్ శిల్పివ్యాలీకి చెందిన మునుకుంట్ల సతీష్‌కుమార్, దీప్తి రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. దాతలకు ఆలయ సిబ్బంది అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు బహూకరించారు.

‘జగనన్న సురక్ష’.. సేవా దీక్ష

- దిగ్విజయంగా అమలు
- ముంగిళ్లలోకే సేవలు
- వేగంగా ధ్రువీకరణ పత్రాల జారీ
- సిఫార్సులు లేకుండానే పథకాల లబ్ధి
- ప్రజల నుంచి విశేష స్పందన

పల్నాడు జిల్లాలో సురక్ష కార్యక్రమం ఇలా..	
సర్వే చేయాల్సిన మొత్తం ఇళ్లు	: 4,32,066
వలంటీర్లు	: 10,595
ఇప్పటివరకు నమోదైన టోకెన్లు	: 85,216
సేవల కోసం జారీ చేసిన టోకెన్లు	: 73,518
ఇప్పటివరకు సేవలు అందించినవి	: 65,342



నరసరావుపేట 9వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మహిళకు ధ్రువపత్రాలను అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జేసీ శ్యాంప్రసాద్ (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలందరికీ సంతృప్త స్థాయిలో మేలు చేయాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకెళుతోంది. ఏ పథకమైనా, ధ్రువపత్రమైనా అందని అర్హులకు అండగా నిలిచే సేవా యజ్ఞాన్ని చేపట్టింది. ‘జగనన్న సురక్ష’ అనే వినూత్న కార్యక్రమాన్ని ఈనెల ఒకటో తేదీ నుంచి విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడటంతోపాటు జనన, మరణ, కుల, ఆదాయ, సీసీఆర్సీ, రేషన్ కార్డు విభజన వంటి 11 రకాల ధ్రువపత్రాలను జగనన్న సురక్ష గ్రామసభల ద్వారా అందిస్తున్నారు. ఫలితంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

89 శాతం మందికి సేవలు

పల్నాడు జిల్లాలో మొత్తం 538 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం దిగ్విజయంగా సాగుతోంది. మొత్తం 6,88,347 ఇళ్లు ఉండగా, 4,32,066 ఇళ్ల హౌస్ హోల్డ్ సర్వే నిర్వహించాల్సి ఉందని అధికారులు నిర్ణయించారు. ఇందులో ఇప్పటికే 3,22,296 ఇళ్లకు జిల్లాలోని 10,595 మంది వలంటీర్లు వెళ్లి ప్రజలకు అందాల్సిన సేవలపై సమాచారాన్ని సేకరించారు. 85,216 టోకన్లను జారీచేసి రిజిస్టర్ చేశారు. వీటిలో 73,518 టోకెన్లను పలు (ధ్రువపత్రాల జారీ)సేవల కోసం ప్రతిపాదించారు. అవసరమైన పత్రాల జారీకి అధికారులు చర్యలు తీసుకున్నారు, ఇప్పటికే 65,342 మందికి ధ్రువపత్రాలు అందించారు. అంటే 89 శాతం మందికి సేవలు అందించారు. మరో 8,176 టోకెన్ల పరిస్థితి పురోగతిలో ఉంది. 11,698 టోకెన్లకు సంబంధించి ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. వీలైనంత త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

శాఖల వారీ సేవలు ఇలా..	
రెవెన్యూ	: 62,870
ఆధార్	: 6,471
పౌరసరఫరాలు	: 3,457
వ్యవసాయశాఖ	: 885

రెవెన్యూ సేవలే అధికం

జగనన్న సురక్ష శిబిరంలో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 62,870 సేవల టోకెన్లు జారీ అయ్యాయి. అర్జీల పరిష్కారంలో నరసరావుపేట అర్బన్, బొల్లాపల్లి, నరసరావుపేట రూరల్, శావల్యాపురం మండలాలు ముందు వరుసలో ఉన్నాయి.

స్పందన భేష్



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా సాగుతోంది. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, సంక్షేమ పథకాల లబ్ధి త్వరితగతిన అందుతున్నాయి. ఫలితంగా అర్జీదారుల నుంచి మంచి స్పందన వస్తోంది. రిజిస్టర్ అయిన టోకెన్లను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా రోజువారీ సమీక్ష చేస్తున్నాం. జగనన్న సురక్ష అమలులో అధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు.

– శివశంకర్ లోతేటి, పల్నాడు జిల్లా కలెక్టర్

కుల, ఆదాయ ధ్రువపత్రాలు వేగంగా అందాయి



నరసరావుపేట బాలయ్యనగర్‌లో సొంత ఇల్లు ఉంది. ఎలక్ట్రికల్ పనిచేస్తుంటా. జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు ఇంటికొస్తే కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాల కోసం దరఖాస్తు చేశా. వెంటనే వాటిని ఉచితంగా జారీ చేశారు. గతంలో వీటి కోసం మీసేవా కార్యాలయానికి వెళ్లి రూ.100 చెల్లించి దరఖాస్తు చేస్తే, వచ్చేసరికి 15రోజులకుపైగా పట్టేది. పరిపాలన గడపదాకా రావడం అంటే ఇదే. ఈ ధ్రువపత్రాల ద్వారా నా భార్యకు చేయూత పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది.

– పి వెంకటరావు, 24వ వార్డు, నరసరావుపేట

సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే సేవలు

రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున



అనంతవరంలో సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిళ్లలోకే వస్తున్నాయని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. మండలంలోని అనంతవరంలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు.

మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఏదైనా పని కావాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో మన గడప వద్దకే సేవలు అందుతున్నాయని వివరించారు. ఈ రెండు వ్యవస్థల ద్వారా లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వచ్చాయని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అంకిత భావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ బాజి, సచివాలయ నిర్మాణ సమన్వయకర్త మేడికొండ రమేష్, ఎంపీటీసీ సభ్యులు అమిరిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతిని చాటి చెప్పాలి

పల్నాడు కలెక్టర్ శివశంకర్



తెలుగు పండితులను సత్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: తెలుగు సంస్కృతీసంప్రదాయాలను నేటి యువతకు తెలియజెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. దీనిలో భాగంగానే టౌన్‌హాలులో ప్రతినెలా 3వ శనివారం నెలనెలా వెన్నెల కార్యాక్రమానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాలులో శనివారం రాత్రి నిర్వహించిన నెలనెలా సాహిత్య మేళా కార్యక్రమంలో భాగంగా తిక్కన సోమయాజి సాహిత్య, సామాజిక అంశాలపై చర్చ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ తిక్కనకు ముందు గ్రంథాలు సంస్కృతంలో ఉండేవనీ, వాటిని గ్రాంధికంలోకి అనువదించి సామాన్యులకు చేరువయ్యేలా తిక్కన చేశారని కొనియాడారు. నన్నయ్య, శైవ కవులకు మధ్యేమార్గంగా తెలుగుకు పెద్దపీట వేసి ఉభయకవి అయ్యారని తెలిపారు. అనంతరం తెలుగు పండితులను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, డీఈఓ కె.శామ్యూల్, సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఓబుల్ నాయుడు, రిటైర్డ్ ఆంత్రోపన్యాసకులు డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి, పీవీఎస్ఆర్ ప్రసాద్, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, చిత్రంలో తలశిల, వరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: ఈనెల 24న కృష్ణాయపాలెంలోని జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణ శంకుస్థాపన, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని 47వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననున్న దృష్ట్యా అందుకు తగిన ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై రాజధాని పరిధిలోని లే అవుట్ల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులతో కలెక్టర్‌తోపాటు ముఖ్యమంత్రి కార్యక్రమాల కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి మురుగుడు హనుమంతరావు సమీక్షించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, మేయర్ కావటి మనోహరనాయుడు, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పాల్గొన్నారు. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 24న రాజధాని పరిధిలోని 25 లేఅవుట్లలోని 47వేల మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ, ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ, ఇటుకల తయారీ యూనిట్, పైలాన్ ప్రారంభోత్సవంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననున్నట్లు వివరించారు. అనంతరం వెంకటపాలెంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొనే లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా ఏర్పాట్లను చేపట్టాలన్నారు. వాహనాల పార్కింగ్, బారికేడ్ల ఏర్పాట్లు, వసతుల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, విజయవాడ సబ్ కలెక్టర్ అధితిసింగ్, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, విజయవాడ నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ అలీమ్ బాషా, డీఆర్వో చంద్రశేఖర్ రావు, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, ఆర్డీఓ ప్రభాకర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, మెప్మా పీడీ వెంకట నారాయణ, డీఈఓ శైలజ, డీపీఓ కేశవ్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదన్‌రావు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డీటీసీ షేక్ కరీమ్ పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలది సుదీర్ఘ ప్రస్థానం

శాసన మండలి ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి



బాపట్ల వ్యవసాయ కళాశాల వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాలది సుదీర్ఘ ప్రస్థానమని, సామాజిక, రాజకీయ నేపథ్యం ఉందని శాసనమండలి ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చెప్పారు. బాపట్ల వ్యవసాయ కళాశాల 78వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఉమ్మారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం ఈ ప్రాంతంలోని బోర్డు హైస్కూలును వ్యవసాయ కళాశాలగా మార్చారని గుర్తుచేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలి విజయోత్సవాలు ఇక్కడే జరిగాయని పేర్కొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థిగా ఈ ప్రాంగణంతో తనకున్న అనుబంధాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. ఇదే కళాశాలలో 27 ఏళ్లపాటు ఆచార్యుడిగా పనిచేయడం తన అదృష్టమని, ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దానని పేర్కొన్నారు. దేశంలో గల 78 వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం ఏడవ స్థానంలో ఉండడం ఆనందదాయకమన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బాపట్ల వ్యవసాయ కళాశాల దేశంలోనే మంచి పేరు గడించిందని, విశ్వవిద్యాలయంలో పెద్దన్న పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. 1945లో కేవలం ముగ్గురు విద్యార్థినులే ఉండేవారని, ఇప్పుడు 65శాతానికి పైగా విద్యార్థినులే సేద్య విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. ఎన్ఆర్ఐ కోటా సీట్లలో 80 శాతం మంది ఈ కాలేజీలోనే చదివేందుకు ముందుకు రావడం కళాశాల ప్రగతికి నిదర్శనమని వివరించారు. అగ్రి దీక్ష ఇక్కడే ప్రారంభమైందని, వర్చువల్ తరగతులూ ఇక్కడ మాత్రమే అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బీపీటీ–5204 వరి వంగడం 1983లో డాక్టర్ ఎం.వి.రెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడే రూపొందిందని గుర్తుచేశారు. విద్యార్థులను సాంకేతికంగా తీర్చిదిద్దేందుకు విదేశాలలోనూ శిక్షణ ఇప్పిస్తున్నట్టు చెప్పారు. కళాశాలలో ఉన్న క్రీడా ప్రాంగణం కూడా బాగుందని వివరించారు. ఉత్తమ కళాశాలగా అవార్డు పొందిన విషయాన్ని ఆయన మరోసారి గుర్తు చేశారు. తొలుత డాక్టర్ వి.జ్యోతి స్వాగతోపన్యాసం చేశారు. అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్ ట్రస్టు కాలేజ్ డెవలప్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ టి.వి.శ్రీధర్, ది ఆంధ్ర అగ్రికల్చరల్ జర్నల్ ఎడిటర్ డాక్టర్ లాల్ అహ్మద్ ప్రసంగించారు.

పూర్వ ఆచార్యులకు సత్కారం


వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పూర్వ ఆచార్యులుగా విశిష్ట సేవలు అందించిన డాక్టర్ ఉల్చి శంకరరావు, డాక్టర్ జి.సుబ్బయ్య, డాక్టర్ డి.విష్ణు శంకర్ రావు, డాక్టర్ పి.వి.కృష్ణయ్యను సత్కరించారు. పూర్వ అడ్మినిస్ట్రేటివ్ అధికారులైన సిహెచ్ కోటేశ్వరరావు, కోల్, ఐ. కోటేశ్వరరావులను కూడా జ్ఞాపికలు, దుశ్శాలువాలతో ఆత్మీయంగా సత్కరించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు

అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థి డాక్టర్ డి.మనోజ్ కుమార్‌ను గోల్డ్ మెడల్‌తో సత్కరించారు. ఎం.వీరేంద్ర, జ్యోతి ప్రశాంతికి వెండి పతకాలు బహూకరించారు. అనంతరం ప్లాటినం జూబ్లీ సావనీర్‌ను ఆవిష్కరించారు. కొత్తగా నిర్మించనున్న పూర్వ విద్యార్థి సంఘ భవన నిర్మాణానికి డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు 10 లక్షల పదివేల 101 రూపాయలను విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో ప్లాటినం జూబ్లీ సావనీర్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కె.నిర్మల్ రవికుమార్, సభ్యులు, పూర్వ విద్యార్థి సంఘం సభ్యులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తజనం

- సారె సమర్పించిన భక్త బృందాలు
- ముగింపు దశకు ఆషాఢ సారె
- నేటితో ఆషాఢ మాసోత్సవాలు ముగింపు



మహామండపంలో అమ్మవారు



అమ్మవారికి సారె తీసుకు వచ్చిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై సోమవారంతో ఆషాఢ మాసోత్సవాలు ముగియనున్నాయి. దీంతో ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని సారెను సమర్పించారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ఆదివారం నిర్వహించిన ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీ చక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమం, గణపతి హోమంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అమ్మవారి దర్శనానికి మూడు గంటలు

ఆదివారం కావడంతో అమ్మవారి దర్శనానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ.300 టికెట్ల క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. మరో వైపున అమ్మవారికి సారెను సమర్పించేందుకు విచ్చేసిన భక్తులను సైతం రూ.300, రూ.100 క్యూలైన్‌లోకి అనుమతించారు. భక్తుల రద్దీతో పలు దఫాలుగా అంతరాలయ దర్శనం నిలిపివేసి ముఖ మండప దర్శనానికి అనుమతించారు. వీఐపీ గేటు వద్ద రూ.500 టికెట్ తీసుకున్న భక్తులు వేచి ఉండేలా ఏర్పాట్లు చేశారు. సారె సమర్పించే భక్తుల రద్దీ తగ్గిన సమయంలో రూ.500 టికెట్ క్యూలైన్‌ను అంతరాలయంలోకి అనుమతించారు. మధ్యాహ్నం 3.30 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

సారె సమర్పించిన భక్త బృందాలు

దుర్గమ్మకు ఆదివారం పలు భక్త బృందాలు సారెను సమర్పించాయి. దుర్గగుడి పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య బృందం, దేవిశెట్టి బాలకృష్ణ బృందం, ఆంధ్రప్రదేశ్ భవానీ దీక్ష వ్యవస్థాపక పీఠం ఈది ఎల్లారావు శిష్య బృందానికి చెందిన 700 మంది భక్తులు, మొగల్‌రాజపురం కళావతి బృందానికి చెందిన 50 మంది, పొన్నూరుకు చెందిన ఎం.అరుణ బృందానికి చెందిన 50 మంది భక్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన 2 వేల మంది భక్తులు అమ్మవారికి సారెను సమర్పించారు. వీరికి ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. కార్యక్రమంలో డీఈవో గురు ప్రసాద్, పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, దేవిశెట్టి బాలకృష్ణ, బచ్చు మాధవికృష్ణ, కేసరి నాగమణి తదితరులు పాల్గొన్నారు. నెల రోజులుగా జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. సోమవారం ఉదయం 7–30 గంటలకు ఆలయ ఈవో, ఆలయ సిబ్బంది అమ్మవారికి సారెను సమర్పించనున్నారు.

అడ్డుకున్న నిఘా సిబ్బంది

కనకదుర్గనగర్ పరిసరాల్లో తిరిగే డిప్యూటీ (శ్రీను) అనే వ్యక్తి ఆదివారం ఆలయంలో విధులు నిర్వహించే ఓ వ్యక్తికి ఫోన్ చేసి ముగ్గురు భక్తులకు వీఐపీ దర్శనం చేయించాలని కోరాడు. దీంతో సదరు ఉద్యోగి ఆ ముగ్గురు భక్తులను ఆలయంలోకి తీసుకెళ్తుండగా, నిఘా సిబ్బంది అడ్డుకున్నారు. ఉద్యోగిని మందలించారు. అక్రమ మార్గంలో వీఐపీ దర్శనాలు చేయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

నెల్లూరు పోలీసుల అదుపులో నరసరావుపేట యువకులు

నరసరావుపేట టౌన్: నరసరావుపేట ప్రాంతానికి చెందిన పలువురు యువకులను నెల్లూరు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. రామిరెడ్డిపేట ప్రాంతానికి చెందిన దానం వెంకట అజయ్‌సాయి ఫిలిఫ్ఫిన్స్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేశాడు. కొన్ని నెలలుగా విదేశాలకు వెళ్లి చదుకునే విద్యార్థుల కోసం కన్సల్‌టెన్సీ నిర్వహిస్తున్నాడు. అజయ్‌సాయికు నెల్లూరులో నివాసం ఉండే హర్షకు మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో తన స్నేహితులు ఆరుగురితో కలిసి నెల్లూరు వెళ్లాడు. రెండు రోజుల కిందట హర్ష గృహంలో చొరబడి మహిళపై దాడికి పాల్పడి విలువైన వస్తువులు అపహరించుకు వెళ్లారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నెల్లూరు వన్‌టౌన్ పోలీసులు నిందితుల కోసం నరసరావుపేటకు వచ్చారు. అజయ్‌సాయితో పాటు దాడిలో పాల్గొన్న సురేంద్ర, మరో ఐదుగురిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

ఆలయం ఉద్యోగికి అండగా టీడీపీ నేతలు

కేసు నుంచి తప్పించేందుకు విశ్వప్రయత్నాలు

తెనాలి: హూండీ లెక్కింపులో బంగారు ఉంగరం తస్కరించిన కేసులో ఆలయ ఉద్యోగిని తప్పించేందుకు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. 'మనం మనం బరంపురం' అన్నట్టుగా ఈ కేసులో సస్పెండయిన ఉద్యోగిని కాపాడేందుకు టీడీపీ నేతలు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వైకుంఠపురంలో ఈనెల 12న హూండీని లెక్కించారు. ఆలయ సూపరింటెండెంట్ నిర్మలారాణి చేతివాటం ప్రదర్శించి బంగారు ఉంగరాన్ని తస్కరించడం, అది బహిర్గతం కావడంతో అదేరోజు ఆమెను సస్పెండ్ చేయటం తెలిసిందే. గతంలో ఇలాంటి చరిత్ర ఆమెకు ఉంది. ఆమెను బయటపడేసేందుకు టీడీపీ నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని విశ్వసనీయంగా తెలిసింది. నిర్మలారాణి తరపు వ్యక్తులు ఫిర్యాదు చేసిన యువకుడి తండ్రిని కలిసి, స్టేట్‌మెంట్ మార్చుకోవాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నారు. మరోవైపు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అనుచరుడు ఒకరు ఆలయ ఈఓకు ఫోను చేసి, ఏదోలా తప్పించాలని కోరినట్లు చెబుతున్నారు. మళ్లీ ఏదోలా గోల్‌మాల్ చేసి నిర్మలారాణిని బయట పడేయాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇంతకుముందు ఆలయ డబ్బులు రూ.2 లక్షలు కైంకర్యం చేసి, బదిలీపై వెళ్లిన వాసు అనే ఉద్యోగి నుంచి వసూలు చేసిన దాఖలా లేదు. ఇప్పుడు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వారినీ వదిలేస్తే, భక్తులకు విశ్వాసం పోయే ప్రమాదముంది.

రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి


పెదకాకాని అంబేడ్కర్‌నగర్‌లో జగ్జీవన్‌రామ్ సాంస్కృతిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఆళ్ల

పెదకాకాని: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగుతోందని రాజ్యసభ సభ్యుడు అళ్ల అయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. పెదకాకాని అంబేడ్కర్‌నగర్‌లో ఆదివారం రాత్రి రూ. 40 లక్షలతో నిర్మించిన జగ్జీవన్‌రామ్ సాంస్కృతిక భవనాన్ని ఆయన స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యతో కలసి ప్రారంభించారు. ముందుగా జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని చెప్పారు. రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిని సైకో అనడం మంచిది కాదని హితవు పలికారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి పొన్నూరు నియోజకవర్గంలో జరిగిందని చెప్పారు. మళ్లీ మంచి మెజార్టీతో గెలిపిస్తే, మరింత అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీడీఓ బి.వి. మల్లేశ్వరరావు, గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, ఎంపీటీసీ సభ్యురాలు మాతంగి నిర్మల, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, ఆలయ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ఆలా రవీంద్ర, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహనరెడ్డి, గోళ్ల జోసఫ్, శ్యాంముఖర్జీబాబు, కొంకి రామారావు, గంగవరపు మల్లేశ్వరరావు, మురికిపూడి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మేదరమెట్ల: ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొరిశపాడు పొలాల్లో ఆదివారం చోటు చెలుగుచూసింది. మేదరమెట్ల పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మేదరమెట్ల మహాలక్ష్మి టుబాకో కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఎం.నాగేశ్వరరావు (48) శనివారం ఉదయం ఇంట్లో కొద్దిపాటి గొడవ జరిగింది. అనంతరం ఉదయం తొమ్మిది గంటలకు టుబాకో కంపెనీకి వచ్చాడు. మధ్యాహ్నం 12.30 సమయంలో భోజనానికి వెళ్లి వస్తానని చెప్పి కంపెనీ నుంచి బయటకు వచ్చాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో నాగేశ్వరరావు కుమార్తె ఎం.రూపాంజలి మేదరమెట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రాత్రి కొన్ని ప్రదేశాల్లో వెతికినట్లు ఎస్సై శివనాగిరెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో కొరిశపాడు పొలాల్లో ఎవరో పురుగుమందు తాగి మృతి చెందాడన్న సమాచారంతో అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శివనాగిరెడ్డి

నాగేశ్వరరావుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు పూర్తిగా తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు పీ.గుడిపాడు గ్రామానికి చెందిన వాడు కాగా రెండేళ్ల నుంచి మేదరమెట్ల గాంధీనగర్‌లో కలసి నివాసం ఉంటున్నాడు.

అంగరంగ వైభవంగా మహంకాళీ అమ్మవారికి బోనాలు

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులో గల శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చిన వెంకటరెడ్డి, ప్రధాన అర్చకులు తారకనాథశర్మ మాట్లాడుతూ ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారిని మొదటి ఆదివారం నిమ్మకాయలతో, రెండో ఆదివారం గాజులతో, మూడో ఆదివారం శాకంబరిగా అలంకరించినట్లు చెప్పారు. నాలుగో ఆదివారం పుష్పాలంకరణతో పాటు బోనాల్ని సమర్పించినట్లు తెలిపారు. తొలుత దేవదాయ శాఖ నుంచి వచ్చిన పట్టు వస్త్రాల్ని అమ్మవారికి అలంకరించినట్లు పేర్కొన్నారు. అమ్మవారి దేవస్థానాన్ని పునరుద్ధరిస్తున్నట్లు వారు చెప్పారు. ప్రభుత్వం నిధులు కేటాయించిందని, హైదరాబాద్‌కు చెందిన వెంకటరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు కూడా సహకరిస్తున్నట్లు తెలిపారు.

వ్యాపారి ఇంటిని ఆక్రమించుకున్న టీడీపీ నేత

- అడ్డుకున్న బాధితులపై టీడీపీ కార్యకర్తల దాడి
- పోలీస్ వాహనం ధ్వంసం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ


టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన బాధితులు


టీడీపీ నాయకుల దాడి దృశ్యాలను డీఎస్పీ కేవీ మహేష్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


బాధితులపై కర్రతో దాడికి పాల్పడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చదలవాడ తదితరులు

నరసరావుపేట రూరల్: టీడీపీ శ్రేణులు పట్టణంలో రెచ్చిపోయారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో కర్రలు, రాళ్లతో కోటప్పకొండ రోడ్డులో బీభత్సం సృష్టించారు. వివరాలు.. కోటప్పకొండ రోడ్డు అమరావతి హోమ్స్‌కు చెందిన జడా శ్రీనివాసరావు కొన్ని నెలలు క్రితం ఐపీ పెట్టాడు. అతడు దాదాపు రూ.3 కోట్ల మేర పట్టణంలో అప్పులు చేశాడు. టీడీపీ నాయకుడు చల్లా సుబ్బారావుకు రూ.1.5లక్షల బకాయి ఉన్నాడు. అమరావతి హోమ్స్‌లో శ్రీనివాసరావుకు చెందిన డూప్లేక్స్ నివాసాన్ని చల్లా సుబ్బారావు స్వాధీనంలోకి తీసుకున్నాడు. దీనిని మిగిలిన బాధితులు నిలదీయడంతో వివాదం మొదలైంది.

టీడీపీ నాయకుల దౌర్జన్యం..

అమరావతి హోమ్స్‌కు జడా శ్రీనివాసరావుకు రుణాలు ఇచ్చిన వారు చేరుకుని చల్లా సుబ్బారావును ప్రశ్నించారు. మాకు శ్రీనివాసరావు డబ్బులు చెల్లించాల్సి ఉందని, ఇంటిని స్వాధీనం చేసుకోవడంపై నిలదీశారు. మరోవైపు చల్లా సుబ్బారావుకు మద్దతుగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అరవిందబాబు, పార్టీ నాయకులు కడియాల రమేష్‌తో పాటు కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. బాధితులుకు అండగా నిలవాల్సిన టీడీపీ నాయకులు ఇంటిని ఆక్రమించుకున్న చల్లా సుబ్బారావుకు మద్దతుగా నిలిచారు. ఇంటిలో ఉన్న బాధితులపై దాడికి దిగారు. మహిళలు అని చూడకుండా విచక్షణ రహితంగా కర్రలతో దాడి చేశారు. పెట్రోల్ పోసి తగులబెడతామని బెదిరించారు.

ప్రతిఘటించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు..

బాధితులకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు రాళ్ల దాడికి దిగారు. కర్రలు, ఇనుపరాడ్‌లతో వీరంగం సృష్టించారు. దీంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రతిఘటించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. టీడీపీ కార్యకర్తల దాడిలో పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను శాంతింపజేశారు. డీఎస్పీ కేవీ మహేష్, సీఐ భక్తవత్సలరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని బాధితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

దౌర్జనాలకు పాల్పడితే సహించం..

బాధితులపై దౌర్జన్యానికి పాల్పడితే సహించేది లేదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి హెచ్చరించారు. టీడీపీ నాయకుడు అరవిందబాబుకు సరైన సమయంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బాధితులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

గుణాత్మక విద్యకు ప్రభుత్వ కృషి అభినందనీయం

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యనందించేందుకు ప్రభుత్వ కృషిని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) అభినందించింది. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశానికి జిల్లా శాఖ అధ్యక్షుడు కె.శ్యాంమోజస్ అధ్యక్షత వహించారు. ప్రభుత్వం వేసవి సెలవులలో ఉపాధ్యాయ బదిలీలు చేపట్టి పూర్తిచేయటంపై సమావేశం హర్షం వ్యక్తం చేసింది. అలాగే సబ్జెక్ట్ టీచర్లు కొరత లేకుండా పదోన్నతులు చేపట్టటంపై ధన్యవాదాలు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, సాంకేతికత సహకారంతో విద్యా బోధన చేసేందుకు ఇంట్రాక్టివ్ ఫ్లాట్ పానల్స్ సరఫరా చేసి గుణాత్మక విద్యను అందించినట్లు చెప్పారు. ఉపాధ్యాయుల బకాయిలకు విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సి.వి.ఎస్.మణి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి


పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- టీడీపీని వీడి పలువురు వైఎస్సార్ సీపీలో చేరికలు

కారెంపూడి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. మండలంలోని పేటసన్నెగండ్ల శివారు బాలచంద్రానగర్(పోతురాజు గుట్ట)కు చెందిన 11 కుటుంబాలు శనివారం రాత్రి టీడీపీని వీడి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. పోతురాజు గుట్టకు చెందిన షేక్ ముస్తాఫా, వేముల మల్లికార్జునరావు, షేక్ సైదావలి, షేక్ మహబూబ్, షేక్ బాజి, మల్లేశ్వరి, షేక్ జాన్, సిద్దావలి, షేక్ బాజి (టైటింగ్), వెంకటేశ్వర్లు, నాగరాజు కుటుంబాలు చేరిన వారిలో ఉన్నారు. వారికి ప్రభుత్వ విప్ పీఆర్కే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ విప్ పీఆర్కే మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషి, మమ్మల్ని ఆకర్షిందని పార్టీలు చూడకుండా తమకు కూడా సంక్షేమ కార్యక్రమాలు అందించారని ఎలాంటి భేషజాలు లేకుండా ఆయన అందిస్తున్న పాలన మాకు నచ్చి పార్టీలో చేరామని వారు ప్రకటించారు. ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరిన అందరికి అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత ప్రగతిని సాధిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి జవ్వాజి నాగేంద్రం, ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీఎంపీటీసీలు కొంగర ఇందిరాదేవి సుబ్రహ్మణ్యం, గాడిపర్తి రమాదేవి పూర్ణయ్య పాల్గొన్నారు.

పాముకాటుతో బాలిక మృతి



దుర్గి/చిలకలూరిపేట టౌన్: పాముకాటులో బాలిక మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని అడిగొప్పల యానాది కాలనీకి చెందిన కొమరగిరి అనిల్ బాబు, పూజ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కుమార్తె మౌనిక స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు చిలకలూరిపేట మండలం పోతవరం గ్రామంలో కూలీ పనులు కోసం వెళ్లారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావటంతో శనివారం బంధువులతో తల్లిదండ్రుల వద్దకు పోతవరం వెళ్లింది. తల్లిదండ్రులతో ఆటపాటలతో సంతోషంగా గడిపి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురైంది. పాప ఏడవడంతో తల్లిదండ్రులు పాము కాటు అని గుర్తించి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స కొనసాగిస్తున్న క్రమంలో బాలిక మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచి నలబోతు చిన్నబ్బాయి మృతి చెందిన బాలిక కుటుంబానికి మట్టి ఖర్చులు కోసం రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులను వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసీ షేక్ హుసేన్ పరామర్శించారు.

రిజిస్ట్రార్ సుశీల పరిశోధన పత్రానికి అంతర్జాతీయ గుర్తింపు

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.సుశీల పోస్టర్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. జులై 1 నుంచి 5వరకు కెనడాలో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఇందులో 130 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఏపీ నుంచి సుశీల పాల్గొని ' ఏ సర్వే ఆన్ ప్రాక్టీషన్ రిగార్డింగ్ కాంపిటెన్స్ ఆఫ్ నర్స్ లీడర్' అనే అంశంపై పరిశోధన చేసి, పోస్టర్ ప్రజెంట్ చేశారు. ఈ పరిశోధన పత్రానికి అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వాహకులు అభినందనలు తెలిపారు. ఈ సదస్సులోనే ' నర్స్ టుగెదర్ ఏ ఫోర్స్ ఫర్ గ్లోబల్ చేంజ్' అనే అంశంపై సుశీల మాట్లాడారు. అమెరికాలోని వివిధ యూనివర్సిటీల్లో నర్సింగ్ కార్యక్రమాలు ఎలా జరుగుతున్నాయనే అంశంపై


అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ సుశీల

ఆమె అధ్యయనం చేశారు. అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం, నర్సింగ్ కార్యక్రమాలపై అధ్యయనం చేసేందుకు తనకు అనుమతి ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, డీఎంఈకి, ఏపీఎస్‌ఎంసీకి సుశీల ఆదివారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతుల్ని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన కారణంగా ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదం వాటిల్లిందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘ జిల్లా అధ్యక్షురాలు బి. ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడారు. గతేడాది 3,4,5 తరగతుల విలీనానికి గురైన ప్రాథమిక పాఠశాలలు సంబంధిత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదరణకు దూరమయ్యాయని తెలిపారు. పిల్లల్ని చేర్పించేందుకు ఇష్టపడని తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు తగ్గడానికి ప్రభుత్వ


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

విధానాలే కారణమని ఆరోపించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కళాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులపై బోధనేతర బాధ్యత భారం పెరిగి విద్యార్థులకు నష్టం వాటిల్లుతోందన్నారు. ఉపాధ్యాయుల్ని బోధనకే పరిమితం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏ.ఎస్. కుసుమకుమారి, ఐక్య ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడు ఎస్. కుమార్‌రాజా, రాష్ట్ర ప్రచురణల కమిటీ నాయకుడు ఎం. హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, ఎల్. శివపార్వతి, ఎండీ. దౌలా పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన కార్మెల్ మాత ఉత్సవాలు


ఆలయ చుట్టూ కార్మెల మాత స్వరూపాన్ని ప్రదక్షిణ చేయిస్తున్న భక్తులు

ఫిరంగిపురం: స్థానిక కార్మెల్ కొండపై నిర్వహిస్తున్న కార్మెల్ మాత ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం బాల ఏసు దేవాలయం విచారణ గురువులు పామిశెట్టి బాలస్వామి, పొన్నెకల్లు విచారణ గురువు పి.తోమాసులు విశేష దివ్య పూజాబలి నిర్వహించారు. కొండమెట్ల వద్ద సంక్రాంతిపాడు విచారణ గురువు సీహెచ్. ప్రభుకుమార్ దివ్య పూజాబలి నిర్వహించారు. అనంతరం కార్మెల్ మాత స్వరూపం వద్ద బిషప్ హౌస్ (గుంటూరు)కు చెందిన పోలిశెట్టి పాపయ్య, శంకవరపాడు విచారణ గురువు లింగారెడ్డి మర్రెడ్డి, బిషప్ హౌస్ సెక్రటరి చిన్నాబత్తిని జోసఫ్ కిరణ్ దివ్య పూజాబలి నిర్వహించి, దివ్య సత్ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. అనంతరం దేవాలయం చుట్టూ కార్మెల్ మాత స్వరూపాన్ని తేరు ప్రదక్షిణం గావించారు.

విశేషంగా భక్తులు రాక

రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు వచ్చారు. కొండను ఎక్కి తలనీలాలు సమర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

కోలాహలంగా తిరునాళ్ల

కొండ దిగువ ప్రాంతాల్లో తిరునాళ్ల కోలాహలంగా జరిగింది. బాల ఏసుదేవాలయ ప్రాంగణాల వద్ద బొమ్మల అంగళ్లు, తినుబండారాలు, రంగుల రాట్నాలు కనువిందు చేశాయి.

అక్షయ పాత్ర సేవలు అభినందనీయం

ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు


సెంట్రలైజ్డ్ కిచెన్‌ను పరిశీలిస్తున్న రాయుడు

మంగళగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం అందించడంలో అక్షయపాత్ర సేవలు అభినందనీయమని ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు కొనియాడారు. కార్పొరేషన్ పరిధి ఆత్మకూరులోని అక్షయపాత్ర ఫౌండేషన్‌లో ఆదివారం ఆయన సెంట్రలైజ్డ్ కిచెన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న గోరు ముద్ద ద్వారా ప్రతి రోజూ 30వేల మంది పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని అందించడం ప్రశంసనీయమన్నారు. దాదాపు 25 వాహనాలతో ఇన్సులేటెడ్ కంటైనర్లతో ప్రభుత్వ పాఠశాలలకు భోజనం సరఫరా చేయడం అభినందనీయమన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ లాభాపేక్ష లేని సంస్థ అని, భారతదేశంలో మధ్యాహ్న భోజనం ద్వారా పిల్లలకు పోషకాహార లోపాన్ని పరిష్కరించడానికి కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలకు ఆకలిని తీర్చడమే కాకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తోందని కొనియాడారు. ప్రభుత్వాల భాగస్వామ్యం, దాతల సహకారంతో పిల్లలకు సేవ చేస్తూ ప్రపంచంలోనే అతి పెద్దస్థాయికి అక్షయపాత్ర ఎదిగిందని వివరించారు. అక్షయపాత్రను సందర్శించడం చాలా సంతోషంగా ఉందని, తన వంతు సహకారం తప్పనిసరిగా అందుతుందని తెలిపారు. ప్రెసిడెంట్ వంశీధర దాస మాట్లాడుతూ ఆచార్య జగద్గురు శ్రీల ప్రభు పాదుల ఆశయాలతో 1500 మందితో మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభమైందన్నారు. నేడు దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 20వేలకు పైగా పాఠశాలల్లో 22 లక్షల మందికి పైగా పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో విలాస విగ్రహదాస, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో 9 మి.మీ. వర్షం

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా ఫిరంగిపురం మండలంలో 9 మి.మీ. వర్షం పడగా, అత్యల్పంగా తాడికొండ మండలంలో 1 మి.మీ. పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. దుగ్గిరాల 7.4 మి.మీ., పెదకాకాని 7, కొల్లిపర 6, గుంటూరు పశ్చిమ 5, గుంటూరు తూర్పు 4, మేడికొండూరు 3.4, చేబ్రోలు మండలంలో 1.2 మి.మీ. చొప్పున వర్షం పడింది.